# అభివృద్ధికి ఆమడ దూరం

- పాలకులు, ప్రభుత్వాలు మారినా రాంసాగర్ తండాలో సౌకర్యాలు శూన్యం
- ఇబ్బంది పడుతున్న తండావాసులు



మధ్యలో నిలిచిపోయిన రోడ్డు పనులు



సగం రోడ్డు వేసి వదిలేసిన ప్రాంతం





ఇందల్వాయి: సిర్నాపల్లి గ్రామ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండే రాంసాగర్ తండావాసులు అభివృద్ధికి ఆమడ దూరంలో కనీస సౌకర్యాలు లేక ఆటవిక జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన తండా స్థితిగతులు మారడం లేదని తీవ్ర మనోవేదన చెందుతున్నారు. 35 కుటుంబాలు, సుమారు 170 మంది జనాభా ఉన్న రాంసాగర్ తండాపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి సమస్యలను తీర్చాలని తండావాసులు కోరుతున్నారు.

**ప్రధాన సమస్యలివే..**

సిర్నాపల్లి నుంచి 4.5 కి.మీల దూరంలో దట్టమైన అడవి ప్రాంతంలో ఉన్న తండాకు బీటీ రోడ్డు కోసం గతంలో రూ.1.90 కోట్లు మంజూరయ్యాయి. అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో 2 కి.మీల రోడ్డు మాత్రమే పూర్తయింది. మిగితా రెండున్నర కి.మీల రోడ్డు మూడేళ్లుగా కంకరతో అలాగే నిలిచిపోయింది. కంకరతో ఉన్న రోడ్డు మీద లారీలు రాక ధాన్యం తరలింపునకు, అంబులెన్స్‌లు, ఆటోలు రాక వైద్య సేవలకు, ఇతర రవాణా అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై సైకిల్లు నడవక హైస్కూల్ పిల్లలు రోజూ సిర్నాపల్లి గ్రామానికి కాలి నడకన వస్తూ పోతూ ఉన్నారు. మార్గమధ్యలో అటవీ ప్రాంతం ఉండటంతో భయాందోళనలకు గురువుతున్నారు. 35 నుండి 40 కుటుంబాలు ఉన్న తండాలో 20 మందికి పక్కా ఇళ్లు లేక పూరి గుడిసెల్లో నివసిస్తూ వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. పెన్షన్, రేషన్, కిరాణ, పంచాయతీ, వైద్యం వంటి సేవలు పొందేందుకు అటవీ ప్రాంతాన్ని దాటి గ్రామానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అటవి శాఖ ఇటీవలే అనుమతులు ఇచ్చినా సరైన నిధులు, కాంట్రాక్టర్ లేకపోవడం వల్ల రోడ్డు పనులు ప్రారంభం కావడం లేదు. రోడ్డు మార్గం సరిగా లేక సకాలంలో వైద్యం అందక ఏడాది కాలంలో నలుగురు మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు.

### రోడ్డు పూర్తయితే సమస్యలు తీరినట్లే



మధ్యలో నిలిచిన బీటీ రోడ్డు పనులను పూర్తి చేస్తే తండావాసులు ఎదుర్కొంటున్న సగం సమస్యలు తీరుతాయి. మూడేళ్లుగా అధికారులు,ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాం. కంకర రోడ్డుపై రాకపోకలు చేయడం కష్టంగా ఉంది. ఈ మధ్యనే అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులు పూర్తి చేయాలి.

–బానోత్ శంకర్, రాంసాగర్ తండా

### ఇళ్లు కట్టించాలి



తండాలో సగం మందికి పక్కా ఇళ్లు లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్నారు. అందరికి ఇళ్లు కట్టించి ప్రతీసారి సిర్నాపల్లి గ్రామానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా రేషన్ బియ్యం, పెన్షన్ తండాలోనే అందించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తే సంతోషిస్తాం.

–లాకవత్ వనిత, రాంసాగర్ తండా

## అటెన్షన్ ప్లీజ్..

### రాకపోకలకు ఇబ్బందులు తొలగేనా..?



మధ్యలో నిలిచిపోయిన వంతెన పనులు

ఇందల్వాయి: ఇందల్వాయి– ఇందల్వాయి తండాల మధ్య చిన్నవాగుపై చేపట్టిన వంతెన పనులు మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తి పనులతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలోపు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

| ప్రశ్నించాల్సిన అధికారి పేరు: | ఫోన్ నంబర్ : |
| --- | --- |
| కిషన్, పంచాయతీరాజ్ ఏఈ, ఇందల్వాయి | 78932 56544 |

## బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: బీజేపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 11, 34వ డివిజన్లలో వాడవాడకూ ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రధాని మోదీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కానీ సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రం అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. దేశ ప్రధాని అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తే.. సోయి లేని సీఎం హాజరుకాకపోవడం సిగ్గుచేటన్నారు. కుటుంబ అభివృద్ధిపై ఉన్న శ్రద్ధ.. రాష్ట్రాభివృద్ధిపై లేదని, పనిగట్టుకుని బీజేపీ, పీఎంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ బీసీల ఆత్మగౌరవాన్ని కించపర్చడమేనని, వెంటనే మంత్రులు మోదీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నాయకులు శీల శ్రీనివాస్, కోడూరు నాగరాజు, కిషోర్, మారుతి, పుట్ట వీరేందర్, రోషన్, వనిత రాజ్‌కుమార్, సుందర్ సింగ్ రాథోడ్, శ్రావణ్ పాల్గొన్నారు.

## 'కార్యకర్తలకు అండగా ఉంటా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పునాదులని.. కార్యకర్తలకు అండగా ఉంటానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా తెలిపారు. నగరంలోని హమాల్‌వాడి చౌరస్తాలో ఆదివారం 15, 35, 36,43 డివిజన్లకు సంబంధించి పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనది ప్రజా సంక్షేమ పాలనని, ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. 60లక్షల సైన్యం కలిగిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, నగరంలోని దుబ్బ స్మశాన వాటిలో జరుగుతున్న పనులను అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా పరిశీలించారు.

## ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

– నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరంలోని ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలని, ఐక్యతతోనే ఏదైనా సాధ్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సూచించారు. ఆదివారం నగరంలో ఆర్య వైశ్య పట్టణ సంఘం, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గణేష్ గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా చితికిపోయిన ఆర్యవైశ్యులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడిగా కొండ వీరశేఖర్ గుప్తా, మాణిక్‌భవన్ సంఘం అధ్యక్షుడిగా ధన్‌పాల్ శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడిగా ఇల్లందుల ప్రభాకర్ గుప్తా, వైశ్య భవన్ అధ్యక్షుడిగా చందూరు ధర్మేంద్ర గుప్తా, కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా పెండ్యాల శ్రీనివాస్ గుప్తా, గ్రాడ్యుయేట్ సంఘం అధ్యక్షుడిగా కుకుట్ల నవీన్‌కుమార్ గుప్తా, ఆర్యవైశ్య మండలి అధ్యక్షురాలిగా దొంతుల ధనలక్ష్మితోపాటు కార్యవర్గసభ్యులతో ముఖ్యఅతిథులు ప్రమాణస్వీకారం చేయించారు. చిన్నారుల స్వాగత నృత్యాలు అలరించాయి.

## విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

– ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



భూమిపూజ చేస్తున్న బాజిరెడ్డి, తదితరులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఆయా డివిజన్లలో రూ.28 కోట్లతో పనులు చేపడతామని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నగర శివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్ రామాలయం వద్ద రూ.38 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 5వ డివిజన్‌కు రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని, వాటితో పనులు చేపడుతామని హామీనిచ్చారు. టెలికాం కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేయాలని, విద్యుత్ హైటెన్షన్ తీగలను సరిచేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్పొరేటర్ సందగిరి సౌజన్య రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నుడా డైరెక్టర్ అభిలాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మొచ్చ శ్రీనివాస్, దాసు, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పాత కార్యవర్గం కొనసాగింపు



నిజామాబాద్ సిటీ: పీఎంపీ(నిజామాబాద్) జిల్లా పాత కార్యవర్గం కొనసాగించాలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం టీఎస్‌జీవో భవనంలో జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పులగం మోహన్, ఉపాధ్యక్షుడు లక్ష్మీరాజ్యం, రవివర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పోశాద్రిలు, సభ్యులు పాల్గొన్నారు.

**పద్మశాలి తర్ప కార్యవర్గం ఎన్నిక**

నిజామాబాద్‌నాగారం: నగరంలో పద్మశాలి తర్ప–7 ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా చౌకి సిద్ధిరాములు, మొదటి ఉపాధ్యక్షులుగా దాసరి రాజేశ్వర్, రెండో ఉపాధ్యక్షులుగా దాసరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గుద్దేటి కిషన్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా గుండు అశోక్‌లను ఎన్నుకున్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు



ధర్పల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈనెల 25, 26, 27లలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని ఈరోజు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే పాలకులు రైతు జపం చేస్తున్నారని వ్యవసాయరంగాన్ని పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు కట్టబెట్టారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## పేపర్ లీకేజీల తప్పిదం ప్రభుత్వానిదే



పూలమాల వేస్తున్న తాహెర్ బిన్ హందాన్, వేణు

ఖలీల్‌వాడి: పేపర్ లీకేజీల తప్పిదానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ అర్బన్ ఇన్‌ఛార్జి తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఆదివారం నగర కాంగ్రెస్ భవన్‌లో ఎన్ఎస్‌యూఐ 53 ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల్లో ఎన్ఎస్‌యూఐ ముందు ఉండి పోరాడుతుందన్నారు. రాజకీయ నాయకులకు విద్యార్థి సంఘం వేదికగా ఉంటుందన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీతో 30 లక్షల మంది పేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు మాట్లాడారు. ఇందిరా గాంధీ ఎన్ఎస్‌యూఐ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో విద్యార్థులకు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇందిరకు నివాళుర్పించారు.

## 'పేపర్ లీకేజీలతో వ్యాపారం'



చేతులెత్తి అభివాదం చేస్తున్న అఖిలపక్ష నేతలు

ఖలీల్‌వాడి: పేపర్ లీకేజీ చేసి ప్రశ్నా పత్రాలతో వ్యాపారం చేసి విద్యార్థుల జీవితంలో నిప్పులు పోస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చలపతిరావు అన్నారు. నగరంలో కోటగల్లీ ఎన్ఆర్ భవన్‌లో అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ.. ఏప్రిల్ 18న అఖిలపక్షం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్, పల్లి కొండ నర్సయ్య, గణేష్, వరదయ్య, అజారోద్దీన్, జన్నారపు రాజేశ్వర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు



డిచ్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం క్రీస్తు పునరుత్థాన పండుగ(ఈస్టర్) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. డిచ్‌పల్లి సీఎస్‌ఐ విక్టోరియా సీఎస్ఐ, నడిపల్లి పాస్టరేట్ సీఎస్ఐ, బర్ధిపూర్ సీఎస్ఐ, ధర్మారం(బి)లోని లూర్ధుమాత, దూస్గాం, ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, యానంపల్లి, మెంట్రాజ్‌పల్లి, కొరట్‌పల్లి తదితర గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ దినకర్, స్టీవెన్ కుమార్ పాల్గొన్నారు.



సార్వజనిక్ గణేశ్ మందిర్‌లో సంకటహర చతుర్థి సందర్భంగా..
- నిజామాబాద్ సిటీ

## 11న విద్యుత్ ఉద్యోగుల సన్నాహక సమావేశం

నిజామాబాద్ నాగారం : టీఎస్‌పీఈజేఏసీ పిలుపు మేరకు ఈనెల 17న విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు వెళ్తున్న దృష్ట్యా ఈనెల 11న నగర శివారులోని పీహెచ్‌ఆర్ కన్వెన్షన్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 11న మధ్యాహ్నం 2 గంటలకు తప్పనిసరిగా ప్రతి విద్యుత్ ఉద్యోగి సన్నాహక సమావేశానికి హాజరు కావాలని తమ డిమాండ్లను సాధించుకునే దిశగా చర్చలో పాల్గొనాలని కోరారు.

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)**

స్క్రీన్–1– దసరా–(తెలుగు),1.10,4.15 7.20,10.25

స్క్రీన్–2– దేశముదురు –(తెలుగు) –2డీ –10.30,7.25,10.30

మీటర్–(తెలుగు) – 1.50

ది పోపెస్ ఎకరిస్ట్–(ఇంగ్లిష్)–4.55

స్క్రీన్–3– రావణాసుర–(తెలుగు)–10.45, 1.40,4.30,7.20,10.20

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

స్క్రీన్–1– రావణాసుర –(తెలుగు) –10.00, 1.05,4.10,7.15,10.20

స్క్రీన్–2 – మీటర్–(తెలుగు) –1.25,4.15

దసరా –(తెలుగు)– 7.05,10.20

స్క్రీన్–3– జాన్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లిష్)–12.40

భోళా–(హిందీ)–2డీ –4.10

మీటర్–(తెలుగు)–7.20;10.10

స్క్రీన్–4– రావణాసుర –(తెలుగు),12.00

2డీ–ది సూపర్–ఎం–(ఇంగ్లిష్) ,3.05,7.45

ది పోపెస్ ఎక్సారా–(తెలుగు),5.20,10.00

| | |
| --- | --- |
| దేవి | రావణాసుర |
| నటరాజ్ | మీటర్ |
| లలితామహల్ | దసరా |
| విజయ్ | బలగం |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
| --- | --- | --- | --- |
| 24 క్యారెట్స్ | 59,300 | వెండి (కిలో) | 73,730 |
| 22 క్యారెట్స్ | 54,667 | – నిజామాబాద్ బిజినెస్ | |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
| --- | --- | --- | --- | --- | --- |
| టమాట | 8 | 16 | క్యాప్సికం | 40 | 60 |
| బెండకాయ | 40 | 60 | గాజరుగడ్డ | 15 | 30 |
| బీరకాయ | 50 | 70 | పచ్చిమిర్చి | 30 | 50 |
| దొండకాయ | 25 | 50 | దోసకాయ | 10 | 20 |
| బీర్నీసుకాయ | 50 | 70 | ఆలుగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 30 | 50 | గోబిగడ్డ | 8 | 15 |
| వంకాయ | 40 | 60 | గోబిపువ్వు | 20 | 40 |
| పాలకూర | 20 | 40 | బీట్‌రూట్ | 20 | 40 |
| మెంతికూర | 40 | 60 | గోరు చిక్కుడు | 50 | 70 |
| కొత్తిమీర | 12 | 25 | చిక్కుడుకాయ | 50 | 70 |
| పుదీనా | 20 | 40 | | | |

– ఇందూరు

### మాంసం ధరలు (రూ.)

| | | | |
| --- | --- | --- | --- |
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్స్‌డ్ | 220 |
| | | లైవ్ | 180 |
| స్కిన్‌లెస్ | 260 | మటన్ | 750 |

## సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగు



డిచ్‌పల్లి: మానవాళి ఆరోగ్యానికి హానికరంగా మారిన రసానియక ఎరువుల వాడకం తగ్గించి రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నూతన శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఘన్‌పూర్‌లో మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు చౌకి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువులు తయారీ, వాడకం, లాభాలపై రైతులకు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. సదస్సులో జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, సీనియర్ నాయకులు విఠల్, సురేష్, సాయిబాబా, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అభినందనలు



నిజామాబాద్‌నాగారం: విద్యార్థులకు ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం కోసం క్యూరియస్ తైక్వాండో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. ఆదివారం గంగాస్థాన్‌లో గల క్యూరియస్ తైక్వాండో అకాడమీలో విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ పరీక్షలు, కోచ్ మాస్టర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టెస్ట్‌లు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈవో లోకం రఘురాజ్, స్పెషల్ గెస్ట్‌గా డిస్ట్రిక్ తైక్వాండో అసోసియేషన్ సెక్రెటరీ మాధ ఈశ్వర్, గెస్ట్ ఆఫ్ హానర్ సైకాలజిస్ట్ శ్రీహరి, పీజీటీ చంద్రశేఖర్ హాజరై విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. బెల్ట్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

### కొనసాగుతున్న వార్షికోత్సవాలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని సిద్ధి వినాయక స్వామి 23వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సంకష్టచతుర్థ పూజ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.నేడు ఉదయం 11 గంటలకు శ్రీసిద్ధి వినాయకస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులుతెలిపారు.

### ఘనంగా సూర్య హోమం



నిజామాబాద్ సిటీ:నగరంలోని మారుతినగర్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ సూర్య హోమం, లక్ష గరిక అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా మంత్రి ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి పాల్గొని పూజలు చేశారు.

### వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఇందల్వాయి: సిర్నాపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తేలు విజయ్, ఎంపీటీసీ అశ్విని శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జక్రాన్‌పల్లి: చింతలూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కుంచాల విమల రాజు ఆదివారం ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పాల సుకన్య ప్రసాద్, ఉప సర్పంచ్ రవీందర్, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జయ గిరిధర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట బోజన్న తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ..**

చింతలూర్ గ్రామానికి చెందిన గోపిడి శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.44 వేల చెక్కును ఎంపీపీ విమల రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

### 'ఎక్సైజ్ అసోసియేషన్‌తో సంబంధం లేదు'

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి, ఎక్సైజ్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, చంద్రమోహన్ ఆదివారం తెలిపారు. డ్రెస్ కోడ్ ఉన్న ఉద్యోగులకు టీఎన్‌జీవోస్ బైలా ప్రకారం సంఘంలో సభ్యత్వం ఉండకూడదని, కానీ ఎక్సైజ్ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణరెడ్డి టీఎన్‌జీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఎక్సైజ్ అసోసియేషన్‌లో ఎలాంటి పదవి లేదని, బైలా ప్రకారం టీఎన్‌జీవోస్ పోస్టులో కొనసాగరాదని స్పష్టం చేశారు. ఎక్సైజ్ అసోసియేషన్‌కు సంబంధం లేదని వారు పేర్కొన్నారు.